రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

ఆధ్యాత్మిక హబ్‌గా కొడంగల్

శ్రీవారి ఆలయ పునర్నిర్మాణానికి సిఎం రేవంత్‌తో భూమి పూజ చేయిస్తున్న అర్చకులు

▶వచ్చే మే నాటికి మహా పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతాం ▶శ్రీవారి ఆలయ వ్యవస్థాపకులు నరసింహులు గుప్తా సంకల్ప బలమే ఈ స్థాయికి తెచ్చింది ▶ఆలయ అభివృద్ధిలో పెద్ద స్వామి సేవలు అనిర్వచనీయం ▶సుందరవర్ధన్ నేతృత్వంలో పూజా విధానాలే ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి ▶ఆయన జ్ఞాపకార్థం మినీ తిరుమలగా అభివృద్ధి ▶కొడంగల్ సభలో సిఎం రేవంత్

శ్రీవారి ఆలయ పునర్నిర్మాణానికి ఘనంగా భూమి పూజ

కొడంగల్, మే 8, ప్రభాతవార్త : కొడంగల్‌ను కర్ణాటక, మహారాష్ట్ర భక్తులను సైతం ఆకర్షించేలా జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా మారుస్తామని సిఎం ప్రకటించారు. ఆయన తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో శుక్రవారం పర్యటించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రూ. 110 కోట్ల భారీ వ్యయంతో పునర్నిర్మించే పనులకు ఘనంగా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సిఎం ప్రసంగిస్తూ, కొడంగల్ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరుతోందని హర్షం వ్యక్తం చేశారు.

ఆలయంతో జ్ఞాపకాలను గుర్తుచేసుకుని భావోద్వేగం

ఈ ఆలయంతో ముడిపడి ఉన్న తన వ్యక్తిగత జ్ఞాపకాలను ఈ ప్రాంత ఆధ్యాత్మిక విశిష్టతను గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా ఆలయంతో విడదీయలేని అనుబంధం ఉన్న దివంగత ఎన్.ఏ.కె. సుందరవర్ధన్ స్వామి (పెద్ద స్వామి)ని సిఎం రేవంత్ రెడ్డి ఎంతో భావోద్వేగంతో స్మరించుకున్నారు. టిటిడి ఆగమ సలహాదారుగా, కొడంగల్ ఆలయ ప్రధాన అర్చకులుగా పనిచేసిన పెద్ద స్వామి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం, స్వామివారి పట్ల ఆయనకు ఉన్న అచంచలమైన భక్తి ఈ ఆలయ విశిష్టతను చాటిచెప్పాయని నివాళుల ర్పించారు. సుందరవర్ధన్ స్వామి భక్తి, నిబద్ధత.. ఆయన నేతృత్వంలో జరిగిన వైఖానస ఆగమ శాస్త్ర పూజా విధానాలే ఈ ఆలయానికి ప్రత్యేక గుర్తింపునిచ్చాయని అన్నారు. ఆయన ఆశీస్సులు కొడంగ్ నియోజకవర్గ ప్రజలపైన, తనపైన ఎల్లప్పుడూ ఉంటాయని ఆకాంక్షి ం చారు. ఆయన జ్ఞాపకార్థం ఈ క్షేత్రాన్ని మరింత గొప్పగా తీర్చిదిద్దుతామని సిఎం పేర్కొన్నారు. ఆయన పేరుతో ఒక విడిది గృహానికి నామకరణం చేయాలని సూచిం చారు.

ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, దివంగత నందారం మిడిదొడ్డి నరసింహులు గుప్తా సేవలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. 1970లో కేవలం 11 నెలల స్వల్ప కాలంలోనే, తిరుమలకు వెళ్ళలేని పేద భక్తుల కోసం ఆయన ఈ ఆలయాన్ని నిర్మించి ఆధ్యాత్మిక వెలుగులు నింపారని కొనియాడారు. నాటి చిన్న ఆలయం వచ్చే ఏడాది మే నాటికి ఒక మహా పుణ్యక్షేత్రంగా అవతరించబోతోందన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే నందారం సూర్యనారాయణ ఈ ఆలయాన్ని టిటిడి నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.

సిఎంకు పూర్ణకుంభంతో స్వాగతం

12.05 గంటలకు హెలిప్యాడ్ నుంచి శ్రీవారి చేరుకున్న సిఎం రేవంత్‌రెడ్డికి ఆలయ మర్యాదలతో సిఎంఓ ప్రత్యేక సెక్రటరీ శ్రీనివాసరాజు, ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ దిపక్ తివారి తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చక బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. ముందుగా బాలాలయంలో శ్రీవారిని దర్శించుకున్న సిఎం శ్రీవేంకటేశ్వరస్వామి, మహాలక్ష్మి, గోదాదేవి ఆలయాలకు, ధ్వజస్తంభం, మండప ప్రాకారాలకు భూమిపూజ చేశారు. హకీంపేట్‌లో రూ.225కోట్లతో నిర్మించనున్న 430 పడకల ఆసుపత్రి, కోస్గి శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, దౌల్తాబాద్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

ఇది సిఎం పూర్వజన్మ సుకృతం : మంత్రి వాకిటి శ్రీహరి

కొడంగల్ శ్రీవారి ఆలయం అద్భుతంగా నిర్మించేందుకు సంకల్పించే అవకాశం రావడం సిఎం రేవంత్‌రెడ్డి పూర్వజన్మ సుకృతమని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఇక్కడ ఈ ఆలయ పునరుద్ధరణ ద్వారా ఆధ్యాత్మిక చింతన వెల్లి విరుస్తుందన్నారు.

ఇటీవల వేములవాడలో రాములోరి ఆలయం, నేడు కొడంగల్‌లో శ్రీవారి ఆలయాలను పునరుద్ధరించటానికి కంకణం కట్టుకున్న రేవంత్‌కు ఆ సర్వేశ్వరుడి ఆశీసులు ఎల్లప్పుడు ఉండాలని ఆకాంక్షించారు.

ఆలయ నిర్మాణం ఓ అద్భుతం : మంత్రి దామోదర రాజనర్సింహ

తిరుమల తిరుపతి తరహాలో కొడంగల్‌లో శ్రీవారి ఆలయం పునర్నిర్మాణానికి పూనుకోవడం అద్భుతమని మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. తిరమల శ్రీవారి దర్శనం కోసం పరితపించే భక్తులు వ్యయప్రయాసలకు గురికాకుండా కొడంగల్‌లోనే స్వామి దర్శనం కల్పిస్తుండడం ముదావహమన్నారు. ఎంత ఎదిగినా ప్రజా సేవలో నిబద్ధత, ఆధ్యాత్మిక చింతన ఉంటేనే పరిపూర్ణత వస్తుందని, అలాంటి లక్షణాలు అన్నీ రేవంత్‌కు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సిఎంఓ ప్రత్యేక కార్యదర్శి శ్రీనివాసరాజు, ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మోహ్రా, స్తపతి శివనాగిరెడ్డి, రామకృష్ణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, కొడంగల్, కోస్గి మున్సిపల్ చైర్మన్‌లు నందారం ప్రశాంత్, నాగులపల్లి నరేందర్‌లతో పాటు నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిఎంతోపాటు శంకుస్థాపన శిలాఫలక ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రులు దామోదర రాజనర్సింహ,వాకిటి శ్రీహరి

సిఎంకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శిరీష, ఎసిపి లక్ష్మీనారాయణ

రెడ్‌మిక్స్‌కాంట్రాక్ట్ పేరుతో రూ.16.50 లక్షలు టోపీ

లాభాలు పంచుతామంటూ భారీగా వసూళ్లు

మొఖం చాటేసిన కేటుగాళ్లపై బాధితుల ఫిర్యాదు

నిందితుల అరెస్ట్ : 2.39 లక్షల నగదు స్వాధీనం

కొత్తూరు, మే 8, ప్రభాతవార్త: కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెడ్‌మిక్స్ కాంట్రాక్ట్ పేరుతో కోట్ల రూపాయల మోసానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితులుగా కమ్మరి రమేష్ అలియాస్ విశాల్, వేముల ప్రేమ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, కార్లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, షాద్‌నగర్‌కు చెందిన వ్యాపారి చిల్లా సూర్య ప్రతాప్ రెడ్డి వద్ద రెడ్‌మిక్స్ కాంట్రాక్ట్ వ్యాపారంలో భారీ లాభాలు వస్తాయని నమ్మబలికి నిందితులు దశలవారీగా పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నారు. అనంతరం లాభాలు ఇవ్వకుండా, పెట్టుబడి డబ్బులు తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా, బ్యాంక్ లావాదేవీల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసులో సుమారు రూ.16.50 లక్షలకు పైగా మోసం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి రూ.2,39,500 నగదు, ఒక ఎర్టిగా కారు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డీసీపీ షాద్‌నగర్ జోన్ వి. సిరీష పర్యవేక్షణలో, ఏసీపీ లక్ష్మీనారాయణ మార్గదర్శకత్వంలో, కొత్తూరు ఇన్‌స్పెక్టర్ జి. నర్సయ్య మరియు సిబ్బంది ప్రత్యేక చొరవతో కేసును చేదించారు.

మహిళలకు అండగా ఉండేందుకే సఖి కేంద్రాలు

వీటి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి

'దిశ' సమావేశంలో ఎంపి ఈటల ఆదేశం

మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్. ఫొటోలో ఎమ్మెల్యేలు సిహెచ్ మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కమిషనర్, అదనపు కలెక్టర్ తదితరులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 8, ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల అమలుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపి ఈటల రాజేందర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ-డిఐఎస్‌హెచ్‌ఎ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపితో పాటు మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి(ఐఏఎస్), జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్(ఐఏఎస్)లు వీరితో పాటు జిల్లాలోని మూడు మున్సిపాల్టీల చైర్మన్లు కె.శిరీషకృష్ణారెడ్డి, జాము రవి, శ్రీదేవి, జిల్లా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారంలో రాజీ వద్దు

ఈ సందర్భంగా ఎంపి ఈటల మాట్లాడుతూ శాఖల వారీగ సమీక్షలు నిర్వహించి అధికారులకు పలు కీలక ఆదేశాలు చేశారు. అంగన్‌వాడి కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలని, గర్భిణీలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని దీనిలో రాజీపడకూడదన్నారు.

గృహ హింస బాధితులకు సఖీ బాసట

గృహ హింసకు గురవుతున్న మహిళలకు అండగా ఉండేందుకు సఖీ కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో ఖాళీగ ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పరిసరాలను శుభ్రంగ ఉంచుతూ మౌళిక సదుపాయాలు కల్పించాలని ఆయన ఆదేశించారు. 10వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో పిహెచ్‌సిలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ 'ఆయుష్మాన్ భారత్'

కేంద్ర ప్రభుత్వ పథకం ఆయుష్మాన్ భారత్‌ను ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పేద కార్మికులకు (బిపిఎల్) అత్యవసర చికిత్సలు అందించటానికి అన్ని ఆసుపత్రుల్లో సేవలు లభించటానికి కృషి చేయాలని మెడికల్ అధికారులను ఆదేశించారు.

కార్మికుల సంక్షేమానికి కఠిన చర్యలు

కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు అందేలా చూడాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి లేవనెత్తగా దీనిపై ఎంపి ఈటల రాజేందర్ స్పందిస్తూ కార్మికుల విషయంలో కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కోఆపరేటివ్ సొసైటీలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించి అక్రమాలకు తావు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చెరువులలో గుర్రపు డెక్కలను తొలగించి నీరు కలుషితం అయ్యే వ్యర్థాలు చెరువులలో కలవకుండ చేపలు చనిపోకుండ సంరక్షించటానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన వారికి కొత్త మంచినీటి కనెక్షన్లు ఇస్తూ ప్రతి ఇంటికి నీరు ఏకరీతిగా సరఫరా జరిగేలా చూడాలని సంబంధిత అధికారికి సూచించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత విద్య

ప్రైవేట్ పాఠశాలల వారు 25శాతం ఉచిత విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారిని ఆయన ఆదేశించారు. డబుల్‌బెడ్ రూమ్స్‌కు సంబంధించి స్థానిక ప్రజలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వారితో పాటు జిల్లా వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువలో వేసిన పైపులను తొలగించిన అధికారులు

ఎట్టకేలకు ఇరిగేషన్ కాలువకు మోక్షం

అక్రమ పైపులను తొలగించిన అధికారులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

తహసిల్దార్ హెచ్చరిక- 'వార్త'కు స్పందన

ధారూర్, మే 8, ప్రభాతవార్త: ధారూర్ మండలం రాజాపూర్ పరిధిలో సాగునీటి కాలువను ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా ఫామ్ ల్యాండ్ వెంచర్ కోసం వేసిన అక్రమ పైపులను అధికారులు ఎట్టకేలకు తొలగించారు. ఈ వ్యవహారంపై వార్త దినపత్రికలో వరుసగా ప్రచురితమైన కథనాలకు రెవిన్యు, ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించారు. గత కొన్ని రోజులుగా రాజాపూర్ గ్రామ సమీపంలోని లక్నాపూర్ ప్రాజెక్టు కాలువలను కబ్జాచేసి భారీ ఆర్‌సిసి పైపులు వేసి రహదారిని నిర్మించుకున్న విషయంపై స్థానిక రైతులు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. దీనిపై వార్తలో వచ్చిన కథనాలతో రంగంలోకి దిగిన ఇరిగేషన్ డీఈ, ఏఈలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తహసిల్దార్‌కు నివేదిక సమర్పించారు. ఈ క్రమంలో తహసిల్దార్ సాజిదా బేగం ఆదేశాల మేరకు రెండు శాఖల అధికారులు సమన్వయంతో కాలువలో వేసిన అక్రమ పైపులను, పూర్తిగా తొలగించి సాగునీటి ప్రవాహానికి మార్గం సుగుమం చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సాజిదాబేగం మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను, సాగునీటి కాలువలను కబ్జాచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని ఎవరైన నిబంధనలను అతిక్రమించి అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి

అవినీతి చెద?

ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎసిబి సోదాలు

పలు కీలక పత్రాలు స్వాధీనం

పూర్తి విచారణ తర్వాత వివరాలు వెల్లడిస్తాం

రంగారెడ్డి జిల్లా అవినీతి నిరోధక శాఖ డిసిపి ఆనంద్

తహసీల్దార్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎసిబి డిసిపి ఆనంద్

రంగారెడ్డి అర్బన్, మే 8, ప్రభాతవార్త : శంషాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు తనిఖీలు చేపట్టారు. పలు దస్త్రాలను పరిశీలించడంతో పాటు తహశీల్దార్ రవీందర్ దత్‌కు సంబంధించిన కారును కూడా తనిఖీ చేశారు. భూముల లావాదేవీల్లో అవకతవకల జరిగాయనే అనుమానంతో ఈ సోదాలు నిర్వహించారు. సాయంత్రం వరకు తనిఖీలు కొనసాగాయి. అనంతరం రంగారెడ్డి జిల్లా అవినీతి నిరోధక శాఖ డిసిపి ఆనంద్ మాట్లాడుతూ...గత కొన్ని రోజులుగా శంషాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో అవినీతి జరుగుతుందని ఫిర్యాదు రావడంతో శక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని రెండు విషయాలలో అవినీతికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పూర్తిగా విచారణ జరిగిన తర్వాత దాని వివరాలు తెలియజేస్తామని తెలిపారు. రెండు విషయాలకు సంబంధించిన కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నామని డిసిపి స్పష్టం చేశారు.

రూ.7,500 కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని పచ్చజెండా

రంగారెడ్డి అర్బన్, మే 8, ప్రభాతవార్త : దేశ అభివృద్ధి ప్రధాని మోడీతోనే సాధ్యమని ప్రజలు బిజెపి పాలనను కొరుకుంటున్నారని వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద షాపూర్‌లోని ఎస్ఎం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోడీ సుమారు 7,500 కోట్ల రూపాయల విలువ చేసే అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభంబోత్సవాలు చేస్తారని తెలిపారు. సాయంత్రం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారని చెప్పారు. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో సభకు తరలి రావాలని పిలుపు నిచ్చారు. మూడవ సారి ప్రధాన మంత్రి గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మన రాష్ట్రానికి వస్తున్న తోలివస్తున్న ప్రధాని మోడీ సభను జయప్రదం చేయాలని పిలపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బొక్క నరసింహారెడ్డి, నరసింహారెడ్డి, అంజన్ కుమార్ యాదవ్ , యువ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సేవెళ్ళ మహేందర్,

10న మోడీ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

బహిరంగసభకు తరలి రావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు

మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

మహేశ్వరం అసెంబ్లీ ఇంచార్జి అందేలా శ్రీరాములు యాదవ్,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్మాటి దేవేందర్ రెడ్డి, నారాయణ యాదవ్, జ్ఞానేశ్వర్, బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ సాధ మల్లారెడ్డి పలువురు రాష్ట్ర జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభలో అభివాదం చేస్తున్న టిఆర్ఎస్ అధినేత్రి కవిత

దసరా దాకా టైం ఇస్తున్నా..

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పూర్తి చేయకుంటే పాలమూరు నుంచే పాదయాత్ర

సిఎం రేవంత్ రెడ్డికి కవిత అల్టిమేటం

జిల్లేడు చౌదరిగూడ వేదికగా శుక్రవారం జరిగిన బహిరంగ సభలో టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ తోపాటు కేంద్రంలోని బిజెపిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సాధనే లక్ష్యంగా ఆమె తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేసేందుకు దసరా వరకు సమయం ఇస్తున్నానని, లేనిపక్షంలో పాలమూరు నుంచే తన పాదయాత్ర, నీటి ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు.

వివరాలు మెయిన్‌లో

సున్నితపదాల్లో అద్భుతాలొలికించిన ఆత్రేయ

: తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు

గానప్రవీణ బిరుదు గ్రహీతలతో నిత్యానందరావు, కొండలరావు, లక్ష్మీనారాయణ, బుజ్జి, దైవజ్ఞశర్మ తదితర అతిథులు

రవీంద్రభారతి, మే 8 ప్రభాతవార్త : గేయరచనల్లో దిట్ట అయిన ఆచార్య ఆత్రేయ అతి సున్నిత పదాల్లో అద్భుత భావాలు ఒలికించారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, యువకళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఘనంగా జరిగిన ఆచార్య ఆత్రేయ 105వ జయంతికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిత్యానందరావు గౌరవ అతిథులు పొత్తూరి సుబ్బారావు, డా. పి.రాజేందర్‌కుమార్, డా, పి.జ్యోతి, ఎస్వీ రామారావు, దైవజ్ఞ శర్మ, బొప్పన నరసింహారావు (బుజ్జి), సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ తదితరులతో కలిసి ప్రముఖ వర్ధమాన గాయనీ గాయకులు అఖిల, టి.బాలకామేశ్వరరావులను ఘనంగా సత్కరించి గానప్రవీణ బిరుదు ప్రధానంచేసి ప్రసంగించారు. దీక్షతో సినీలోకంలో ప్రవేశించిన ఆత్రేయ సంగీత ప్రపంచానికి తనదైన ప్రత్యేక్షశైలిలో లాలిత్యాన్ని, మాధుర్యాన్ని అందించారన్నారు. సభకు ముందు నాపాట నీనోట పలకాలచిలకా సినీగీతాల విభావరి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుని మైమరపించింది.

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నిజాంపేట్, మే 8, ప్రభాతవార్త

చెట్ల కొట్టివేత, విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ బాచుపల్లి అసిస్టెంట్ ఇంజనీర్ ఎ. శశిధర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 11 కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, మా విల్లాస్, ఎస్ఎల్జీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. ఈ సమయంలో హిల్ కౌంటీ రోడ్, కాకతీయ నగర్, ఇందిరా నగర్, బాచుపల్లి గ్రామం, ఎస్సీ కాలనీ, సీతారామ హోమ్స్, మా విల్లాస్, బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియా, ప్రణీత్ అంటిల్లా రోడ్, కౌసల్య కాలనీ ప్రాంతాలు ప్రభావితమవుతాయని తెలిపారు. అలాగే ఉదయం 11 గంటల నుంచి 11:30 గంటల వరకు 11 కేవీ కోకాకోలా, అపర్ణ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమయంలో కోకాకోలా ఇండస్ట్రియల్ ఏరియా, అపర్ణ, సాయి అనురాగ్ కాలనీ, కౌసల్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు కోరారు.

సికింద్రాబాద్ జోన్ పరిధిలో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహణ

సికింద్రాబాద్, మే 8 ప్రభావార్త:

హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ జోన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ధూమపానం చేసే వారిపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్ మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 38 పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు.. ఈ బృందాలు జోన్ పరిధిలోని జీహెచ్ఎంసీ పార్కులు, స్మశాన వాటికలు, వైన్ షాపులు, జనావాసాలు లేని ప్రాంతాలతో పాటు ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ఈ ఆపరేషన్ వివరాలు: ఒకరు గంజాయి సేవిస్తున్న వ్యక్తిని, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న 28 మందిని గుర్తించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 81 మందిపై చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారందరిపై కేసులు నమోదు చేశారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చి, ప్రజలకు అసౌకర్యం, ఇబ్బంది కలిగించే ఇటువంటి పనులను పునరావృతం చేయవద్దని హెచ్చరించారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలో బహిరంగ మద్యపానం, ధూమపానం. గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని డీసీపీ తెలిపారు.

రాజ్యాంగబద్ధమైన వాటా కోసం బిసిలు ఉద్యమించాలి

హైదరాబాద్, మే 8 ప్రభాతవార్త

రాజ్యాంగబద్ధమైన వాటా కోసం బీసీలు ఉద్యమించాలని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ పిలుపునిచ్చారు. ఓబీసీ వర్గానికి చెందిన ప్రధాన మంత్రి ఓబీసీల పట్ల మీ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. శుక్రవారం పొలిటికల్ ఫ్రంట్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్‌తో కలిసి మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి 9వ షెడ్యూల్లో చేర్చి అమలు చేయాలని, జనగణనలో కులగణను లెక్కించాలని, బీసీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీ రక్షణచట్టాన్ని తీసుకురావాలని, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ను పునర్ సమీక్షించాలని, రోహిణి కమీషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ కులాల వారీగా బీసీ కార్పొరేషన్ చైర్మన్లను ప్రకటించిన ప్రభుత్వం ఆ కార్పొరేషన్లకు అవసరమైన అధికారాలు, నిధులు, స్వయం నిర్ణయాధికారాన్ని ఇవ్వలేదని ప్రశ్నించారు. చైర్మన్ పదవులను కేవలం పేరుకే పరిమితం చేసి జీతాలు కుర్చీలు వైస్ చైర్మన్ హోదాకు పరిమితం చేయడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ బైరు శేఖర్, పోతగాని ఐలన్ గౌడ్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయంలో బిజెపి నేతలు పూజలు



అత్తాపూర్ మే8,ప్రభాతవార్త : ప్రధాని నరేంద్రమోడీ బహిరంగ సభకు పెద్దఎతున తరలివెళ్లి జయప్రదం చేద్దామని పలువురు బిజెపి నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం బిజెపి రాజేంద్ర నగర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు గడీల పద్మావతి ఆధ్వర్యంలో శివరాంపల్లి విజయానంద్ గార్డెన్ దగ్గర శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో బిజెపి నేతలు పూజలు చేసి హారితి ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మూడవసారి ప్రధాని అయిన తర్వాత వస్తున్న సందర్భంగా మే 10న సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్ జరిగే భారీ బహిరంగ సభ విజయవంతం కావాలని మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయుధారోగ్యాలతో క్షేమంగా ఉండాలని కోరుకున్నారు..ఈ కార్యక్రమంలో గోల్కొండ గోషామహల్ ఇన్చార్జ్ వై శ్రీధర్ గారు రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పసుపుల సందీప్ ముదిరాజ్ గారు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి హరికిషన్ సరితా రెడ్డి కృష్ణవేణి లీ మాధవి మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలి : శ్రీనివాస్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సైఫాబాద్, మే 8 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలైనా బిసిల పరిస్థితి మారలేదని, ప్రత్యేక తెలంగాణ వచ్చిన తరువాత కూడా బిసిలకు న్యాయం జరగకపోవడం అన్యాయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ వచ్చిన తరువాత కూడా బిసిలకు న్యాయం జరగకపోవడం బాధకరమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థుల కోసం పోరాడి సాధించుకున్న ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని నేడు నిబంధనల పేరుతో నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన బిసి విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం వస్తే మేజార్టి ప్రజలకు రాజ్యాధికారం లభిస్తుందని, ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయం తెలంగాణ రాష్ట్రంలో జరగదని భావించిన వందలాది మంది విద్యార్థులు, యువజనులు బలిదానాలు చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది బడుగు విద్యార్థుల చదువులకు భరోసా నింపిన ఫీజుల రీయంబర్స్ మెంట్ పథకాన్ని నేడు తెలంగాణ రాష్ట్రంలో అగ్రకుల ప్రభుత్వాలు జివొ నెంబరు 7ను విడదల చేసి ఈ పథకానికి ఉరి తీసిందని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకుండా పేద విద్యార్థుల పీకలు పిసుకుతున్నదని దుయ్యబట్టారు. ప్రక్క రాష్ట్రంలో బిసి సబ్‌ప్లాన్, ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకం యధావిధిగా అమలు జరుగుతుంటే ఇక్కడ బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోధ వరుణ్‌కుమార్‌ను నియమించారు. ఈ సదస్సులో బిసి నాయకులు కుందారం గణేషాచారి, శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బిసి'ఎ'లోకి మార్చాలని సిఎంకు వినతి

- త్వరలోనే తీపి కబురు వింటారని హామీనిచ్చిన సిఎం

సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రంను అందజేస్తున్న ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మంత్రి శ్రీహరిలు.

నార్సింగి, మే 8 ప్రభాతవార్త : విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో వెనుకబడిన ముదిరాజ్ సామాజిక వర్గంను బిసి'డి' నుంచి బిసి'ఎ'లోకి మార్చాలని రాష్ట్ర ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మంత్రి శ్రీహరిలు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఇఇపిసి–2026 నివేదికలో ముదిరాజ్ సమాజం సామాజిక, విద్యా, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉందని స్పష్టంగా వివరించారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసి ముదిరాజ్ సమాజానికి తక్షణమే న్యాయం చేయాలని సీఏంను కోరినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభా పరంగా అగ్రస్థానంలో ఉన్న ముదిరాజ్‌లు విద్యా, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక రంగాలలో వెనుబడి ఉన్నారని, వీరిని ఇతర సామాజిక వర్గాలతో సమానం చేయాలంటే బిసి'ఎ'లో చేర్చడం ఒక్కటే మార్గమని సీఏంకు వినతిపత్రంలో విన్నవించామన్నారు. వినతి పత్రం చదివిన తరువాత సీఏం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే తీపి కరుబు వింటారని పేర్కొన్నారని ముదిరాజ్ సామాజికవర్గ పెద్దలు తెలిపారు. ఈ అంశంను త్వరితగతిన చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారని వివరించారు. సీఏం సానుకూల స్పందన పట్ల ముదిరాజ్ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ముదిరాజ్ సమాజాభివృద్ధికి, యువత భవిష్యత్తుకు, సముచిత అవకాశాలకు బిసి'ఎ' ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. సీఏంకు వినతిపత్రం ఇచ్చిన వారిలో ముదిరాజ్ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు మోత రోహిత్ ముదిరాజ్, సీనియర్ నేత బి.వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా సాగిన శృంగార రథోత్సవం



శృంగార రథోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు శృంగార రథోత్సవంపై అధిరోహించారు. పాంచరాత్రాగ శాస్త్రోక్తంగా ఉత్సవాలను ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ వి.అంబుజ ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, మహానివేదన, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పతాధివాసము, హవనము, భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణము కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వెలపల సాంస్కృతిక కార్యక్రమాలు, లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలు నిర్వహించారు. కాగా బుధవారం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుంది. సోమవారం ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది.

నేడు పూర్ణాహుతి, చక్రతీర్థము

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుందని ఈవో అన్నపూర్ణ వివరించారు. 20న ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం అరు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిరోజు లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలుంటాయి.

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా శివరాత్రి బిక్షంను నియమించాలి



ప్రసంగిస్తున్న తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు చైర్మన్ శివరాత్రి అయిలమల్లు

చిక్కడపల్లి మే 8 (ప్రభాతవార్త) : వడ్డెర కులస్తుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవికి, గత 15 ఏళ్లగా కుల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న శివరాత్రి బిక్షంను నియమించాలని తెలంగాణ వడ్డెర సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు, చైర్మన్ శివరాత్రి అయిలమల్లు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శివరాత్రి అయిలమల్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని, అయితే చైర్మన్ నియామకంలో తీసుకున్న నిర్ణయం పునరాలోచించుకోవాలని కోరారు. 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మరియు 604 మండలాల ప్రతినిధులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపిన శివరాత్రి బిక్షంను కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఎవరికీ పరిచయం లేని గుంజ రేణుక నారాయణను ప్రకటించడం సరికాదన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కోశాధికారి గుర్రం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మంజల నగేష్, రాష్ట్ర కార్యదర్శులు వల్లపు శంకర్ రాజు, సంపంగి కృష్ణ, ప్రచార కార్యదర్శి గిరిశెట్టి రాజు పాల్గొన్నారు.

మోడీ బహిరంగ సభను విజయవంతం చేయండి



చిక్కడపల్లి మే 8 (ప్రభాతవార్త) : ఈ నెల 10వ తేదీ ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ కోరారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, బాపు నగర్, వివేక్ నగర్, కాపువాడ, పద్మివాడ బస్తీలతో పాటు పీపుల్స్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధాని మోడీకి ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు, మేధావులు, ఉన్నత విద్యావంతులు, యువత భారీ సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్, సత్తి రెడ్డి, శ్రీనివాస్, సత్యేంధర్, లక్ష్మి మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వ కార్పొరేట్ కుట్ర



నిరసన తెలుపుతున్న నేతలు

కంటోన్మెంట్, మే 8 ప్రభాతవార్త: భారత రైల్వే బోర్డు ఏప్రిల్ 26న ప్రకటించిన మానవశక్తి హేతుబద్ధీకరణ మ్యాన్ పవర్ రేషనలైజేషన్ 2026–27 పేరుతో 2 పోస్టుల తగ్గింపు (సుమారు 29,608 పోస్టులు) నిర్ణయం సాధారణ పరిపాలనా చర్య కాదని, ఇది దేశ యువతపై నేరుగా చేసిన దాడి అని , ప్రజా రంగాన్ని కార్పొరేట్‌లకు అప్పగించే కుట్రలో భాగమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ తీవ్రంగా ఆరోపిస్తోంది. రైల్వే బోర్డ్, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని రైల్ నిలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు, అనంతరం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ కు ఏఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కోశాధికారి పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, సల్మాన్ బేగ్, ఎల్లంకి మహేష్, శేఖర్, మధుకర్, రాజ్ కుమార్, మెస్రం భాస్కర్, ఆంజనేయులు, చారి, అజీమ్, భరత్, అలీ, కిరణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర బిజెపి చీఫ్ రామచందర్ రావు



పోస్టర్‌ను విడుదల చేసిన రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్

చార్మినార్,మే 8 ప్రభాతవార్త : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు సంబంధించిన ఉర్దూ పోస్టర్‌ను శుక్రవారం రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.

వడ్డెరల సమస్యలను ప్రధానికి వివరిస్తాం

-అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం

ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న వేముల లక్ష్మణ్, మైశయ్య, లోకేష్, మాధవి,రాజమ్మ తదితరులు

హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాని నరేంద్రమోదీకి వివరిస్తామని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్షణ్ తెలిపారు. దేశ వ్యాప్యతంగా వడ్డెర కులస్తుల సమస్యలను ప్రధాని మోదీకి వివరించేందుకు అవకాశం కల్పించాల్సిందిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్రావుకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు దండుగుల మైశయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో జరిగిన జనగణనలో తమ కులం జనాభా సంఖ్యను తక్కువగా చూయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్ల పోరాట ఫలితంగా బీసీఏలో ఉన్న తమ కులాన్ని ప్రభుత్వం (డీ నోటిఫైడ్ ట్రైబ్స్) డీఎన్టీలో చేర్చడం హర్షించదగిన విశయమన్నారు. ప్రభుత్వాలు తమ కులాన్ని డీఎన్టీలో చేరిస్తే సరిపోదని, వడ్డెరుల అభివృద్దికి వేయ్యి కోట్ల నిధులు కేటాయించి అభివృద్ది పరచాలని డిమాండ్ చేశారు. సంఘం అద్వర్యంలో ఏళ్లుగా పోరాటం చేస్తుంటే కొందరు తమ సంఘం పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కులాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తే సంక్షేమ సంఘం చూస్తూ ఊరుకోదని, అవినీతి నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బోదాస్ మాధవి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డా. లోకేష్ వేముల, ప్రధాన కార్యదర్శి మక్కల శేఖర్, ఆలకొండ రాజమ్మ వెంకటేష్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథా కళా వైభవం భావితరాలకు అందించడం మన బాధ్యత

-సిబిఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ

బుర్రకథ కళాకారులను సత్కరిస్తున్న సిబిఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ , చిత్రంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి తదితరులు

చిక్కడపల్లి మే 8 (ప్రభాతవార్త) : తెలుగు నేల గర్వించదగ్గ జానపద కళారూపాలలో బుర్రకథ అత్యంత విశిష్టమైనదని, ఇలాంటి కళలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని సిబిఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళా కారులచే బుర్ర కథ సప్తాహంలో చౌక్ లింగం బృందం చే భక్త మార్కండేయ బుర్రకథను అద్భుతంగా చెప్పారు. గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ నాగమారుతి శర్మ ప్రసంగించారు. స్వతంత్ర ఉద్యమ కాలం నుండి సమాజంలో చైతన్యం నింపడంలో బుర్రకథ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. నేటి ఆధునిక కాలంలో ఇతర వినోద సాధనాలు పెరిగినప్పటికీ, బుర్రకథా కళాకారులు తమ ప్రాణప్రదంగా ఈ విద్యను కాపాడుకుంటూ రావడం అభినందనీయమన్నారు. జానపద కళాకారులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలని, అప్పుడే భావి తరాలకు మన సంస్కృతి అందుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాహితికిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, గానసభ గానసభ సంయుక్త కార్యదర్శి తాళ్లపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాల అందజేత



ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలు అందజేస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్, మే 8 ప్రభాతవార్త: సీనియర్ బీఆర్ఎస్ కంటోన్మెంట్ నాయకుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలను అందజేశారు. కంటోన్మెంట్ వార్డు 1కి చెందిన అబ్దుల్ లతీఫ్ జాహిద్‌కు వైద్యం కోసం రూ.1లక్షా 50వేలు మంజూరయ్యాయి. ఇందకు సంబంధించిన పత్రాలను అందజేశారు.

రేషన్ షాపుల్లో మే, జూన్ నెలల గోదుమల పంపిణీ

కంటోన్మెంట్, మే 8 ప్రభాతవార్త: సికింద్రాబాద్ 9వ సర్కిల్ సివిల్ సప్లై పరిధిలో ఉన్న తెల్ల రేషన్ కార్డు హోల్డర్లకు మే, జూన్ 2 నెలలకు సంబంధించిన గోధుమలు పంపిణీ చేస్తున్నామని అసిస్టెంట్ సివిల్ ఆఫీసర్ చాముండేశ్వరి తెలిపారు శుక్రవారం రెజిమెంటల్ బజార్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైట్ రేషన్ కార్డు హోల్డర్లు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆమె తెలిపారు. లేనిపక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ నిత్యవసర సరుకులు నిలిపివేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు అరుణ అభిషేక్ తివారి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అద్భుతమైన గాయని ప్రసన్న విజయ్ కుమార్



ప్రసన్న విజయ్ కుమార్‌కు స్వరకోకిల పురస్కారం ప్రధానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి మే 8 (ప్రభాతవార్త) : అద్భుతమైన గాయని ప్రసన్న విజయ్ కుమార్ అని వక్తలు అన్నారు. శుక్రవారం ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇసాన్ ఫౌండేషన్, విజయ్ క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ గాయని స్వర్గీయ పి.వి. సుజాత మూర్తి స్మారకార్థం జరిగిన కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయని ప్రసన్న విజయ్ కుమార్‌కు ఖిస్వరకోకిలఖి పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. నిర్వాహకులు పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మిల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో జంట నగరాలకు చెందిన ప్రముఖ గాయనీ గాయకులు 90కి పైగా మధురమైన సినీ గీతాలను ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా పి.వి. సుజాత మూర్తి పేరిట ఏర్పాటు చేసిన తొలి ప్రతిష్ఠాత్మక అవార్డును ప్రముఖ గాయని ప్రసన్న విజయ్ కుమార్ కు ప్రదానం చేశారు. సుమారు 150కి పైగా ప్రైవేట్ ఆల్బమ్స్‌లో తన మధుర గానంతో అలరించిన ఆమెకు ఖిస్వర కోకిలఖి బిరుదుతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మి మాట్లాడుతూ 2022 నుండి 2026 వరకు తమ సంస్థ నిర్వహించిన 90కి పైగా కార్యక్రమాల్లో పాల్గొని ఆదర్శంగా నిలిచినందుకే ప్రసన్న విజయ్ కుమార్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి ఏటా ప్రతిభావంతులైన గాయనీ గాయకులను ఇలాగే ప్రోత్సహిస్తామని వారు పేర్కొన్నారు. గాయని గాయకులూ పివి.రమణమూర్తి, భవాని రవి కుమార్ , ప్రసన్న, సౌమ్య, సవితశ్రీ తదితరులు అద్భుతంగా గానం చేసారు.

జనగణనలో పాల్గొన్న డిజిపి, హైడ్రా కమిషనర్



జనగణన పోస్టర్లను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి చూపుతున్న డీజీపీ సీవీ ఆనంద్

జూబ్లీహిల్స్, మే 8, ప్రభాతవార్తః రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని తన నివాసంలో శుక్రవారం సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో పాల్గొన్నారు. నగరంలోని ప్రతి ఒక్కరూ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సులభమైన జనగణనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఎన్. శంకర్, ఏఎంసీ కైలాస్‌చాంద్, టెక్నికల్ పర్సన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సైతం శుక్రవారం జనగణన పూర్తిచేశారు. ఇప్పటికే ఎస్ఐఆర్ సైతం పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం సర్కిల్ 38 పరిధిలో స్వచ్ఛభారత్, సానిటేషన్ తదితర అంశాలపై డీఎంసీ సురేష్‌కుమార్‌తో చర్చించారు.

బహుజన హితాయ బహుజన సుఖాయ ఆకాశవాణి నినాదం



ఆకాశవాణి వాకథాన్‌ను ప్రారంభిస్తున్న ఎన్.వి.రమణ, హరిసింగ్ తదితర ఆకాశవాణి హైదరాబాద్ సిబ్బంది

నాంపల్లి, మే 8 ప్రభాతవార్త : బహుజన హితాయ, బహుజన సుఖాయ నినాదంతో అందరి శ్రేయస్సు, అభివృద్ధి ధ్యేయంగా ఆకాశవాణి తమ ప్రసారాలు అందిస్తుందన్న ఆకాశవాణి తెలంగాణ క్లస్టర్ డిడిజి(ఈ) హరిసింగ్, ఆకాశవాణి ప్రసారాలు మొదలై 90 వసంతరాలు పూర్తి చేసుకుంటున్న శుభసందర్భంగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 6.30గంటల నుండి నిర్వహించిన విజయవంతమైందన్నారు. ఆకాశవాణి సిగ్నేచర్ ట్యూన్, వందేమాతరం, మంగళధ్వనితో ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంగణంలో ప్రారంభమైన ఈ వాకథాన్‌లో ఆకాశవాణి, దూరదర్శన్ సిబ్బందితోపాటు ప్రాంతీయ వార్తవిభాగ సిబ్బంది, కాజువల్ అనౌసర్లు, ఆర్‌జెలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భానోతు హరిసింగ్, ఎన్.వి.రమణలు ఆకాశవాణి ఎట్‌దరేట్90 వాకథాన్‌ను ఫ్లాగ్‌ఆఫ్‌చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ వాకథాన్ బషీర్‌బాగ్, సచివాలయం మీదుగా సాగి తిరిగి ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంగణంలో దిగ్విజయంగా ముగిసింది. ఆకాశవాణి ప్రధాని నరేంద్ర మోదీ మనసులో మాట గత 132 నెలలుగా హిందీతోపాటు దేశంలోని అన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారంచేస్తూ ప్రజలకు మరింత చేరువైందన్నారు. హైదరాబాద్ దూరదర్శన్ కేంద్ర సంచాలకుడు, డిడిజి(ఈ) ఎన్.వి.రమణ మాట్లాడుతూ ఆకాశవాణి కార్యక్రమాలు అనాదికాలం నుండి వస్తున్న ప్రాచీన భారతీయ సంస్కృతి, కళలు, కళారూపాలను, సాహిత్యాన్ని పరిరక్షిస్తూనే నిత్యనూతన రూపకల్పనలతో ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని, ఆకాశవాణి ప్రసారాలు ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని నిరంతరం అందించే సమాచార ఘని అని కొనియాడారు.

మీ ప్రాంతాల్లో మైనింగ్ జరుగుతోందా..?

-క్రషర్లతో పాటు ఆర్ ఎంసీ ప్లాంట్లు నడుస్తున్నాయా..?

-9000113667కు సమాచారమివ్వాలని కోరిన హైడ్రా

హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త: మీ ప్రాంతాల్లో మైనింగ్ జరుగుతోందా..? కొండలను పిండి చేస్తున్న క్రషర్లు పని చేస్తున్నాయా..? ఆర్ ఎం సీ(రెడీ మిక్స్ కాంక్రీట్) ప్లాంట్లు దుమ్ము రేపుతున్నాయా..? పర్యావరణానికి ఇవన్నీ తూట్లు పొడుస్తున్నాయా..? అయితే ఆ సమాచారం హైడ్రా 9000113667కు అందజేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో నగర ప్రజలను కోరారు. ఓఆర్ఆర్ కు లోపల, బయట 1 కిలోమీటరు పరిధిలో ఆర్ఎంసి, క్రషర్లు పని చేస్తున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కరెంటు లొకేషన్‌తో పాటు..అక్కడి ఫొటోలు వాట్సాప్‌లో షేర్ చేసి సమాచారం ఇస్తే.. వాటి అనుమతులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

-జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



అత్తాపూర్ మే8,ప్రభాతవార్త : ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని పిరంచెరువు ప్రాంతాన్ని డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, ఎస్ఈ నరేందర్ గౌడ్ , డీఈఈ యాదయ్య , యూబీడి మేనేజర్ వెంకటేష్ ,డీఈ ఎస్‌డబ్ల్యూఎం అభిషేక్‌లతో కలిసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి రోడ్ల పరిస్థితి, డ్యామేజీలు మరియు స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా 99 రోజు ప్రణాళికలో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వేగవంతంగా మరియు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ఇళ్ల సముదాయంలో అవసరమైన డ్రైనేజ్ సిస్టమ్ మరియు రోడ్డు సదుపాయాల కోసం సంబంధిత అధికారులు సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలని ఎస్ఈ, ఏఈ , డీఈఈలకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

స్వీయ జనగణనపై అవగాహన ర్యాలీ

కందుకూరు, మే 8, ప్రభాతవార్త: జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి కోరారు. దేశాభివృద్ధికి దోహదపడే ఈ పవిత్ర యజ్ఞంలో విద్యావంతులంతా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. స్వీయజనగణనపై అవగాహన నకోసం కందుకూరు డివిజన్ కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం నుండి హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మే పదవ తేదీ వరకు సొంతంగా ప్రజలు మొబైల్‌లోనే జనగణన వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు. జనగణన మొదటి దశలో భాగంగా ఇళ్లకు సంబంధించిన లెక్కింపు జరుగుతోందని, దీనికి సంబంధించి వివరాలు చాలా తేలికగా అర్థం చేసుకునే విధంగా ఉంటాయని, వాటిని ఎవరికి వారు సొంతంగా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు. జనగణన వివరాలతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడానికి ప్రభుత్వాలకు వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెన్సెస్ అధికారి శిరీష, కందుకూరు మండల్ తహసీల్దార్ గోపాల్, ఎంపిడివో సరిత, వినోద్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యం

పెద్దేముల్, మే 8, ప్రభాతవార్త: విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, విలువలు ఎంతో ముఖ్యమని మండల తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ అన్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుక్రవారం పెద్దేముల్ మండల తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ అధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించి ఆయా శాఖల అధికారులందరిచే విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ మాట్లాడుతూ కష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఉన్నత ఫలితాలను సాధించవచ్చని అన్నారు. విద్యార్థుల విజయంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రతిభలో ఎవరికి తక్కువకారని అన్నారు. మొబైల్, సోషల్ మీడియా వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యసాధనపై దృష్టి సారించాలని అన్నారు. ఉన్నత విద్యతో పాటు మంచి వ్యక్తిత్వం కూడా పెంపొందించుకోవాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిషత్తులో డాక్టర్లు, ఇంజనీర్లు, అధికారులై సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. పదవ తరగతి జీవితానికి పునాది అని భవిషత్తు లక్ష్యాలను ఇప్పటినుంచే నిర్ణయించుకోవాలని సూచించారు. మండలానికి మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థులను అభినందించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ తిరుమలస్వామి, మండల విద్యాదికారి నర్సింగ్‌రావు, యంపిఓ రతన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నట్టల మందు వేయించాలి

పెద్దేముల్, మే 8, ప్రభాతవార్త: ప్రతి రైతు తమ పశువులకు తప్పనిసరిగా నట్టల మందును వేయించాలని పెద్దేముల్ మండల పశువైద్యాధికారి డాక్టర్ దీప్తి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధ్వర్యంలో ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్స ఆరోగ్య శిబిరము నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు నట్టల సమస్య ఎక్కువగా ఉండటంతో ముందస్తు జాగ్రత్తగా నట్టల మందును వేయించడం ఎంతో శ్రేయస్కరమని అన్నారు. నట్టల వల్ల పశువుల ఆరోగ్యం దెబ్బతిని పాల ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉందని అన్నారు. పశువులకు సమయానికి మందులు వేయించడం ద్వారా వ్యాదులను నివారించి రైతుల ఆర్థిక నష్టాన్ని తగ్గించవచ్చని అన్నారు. పశువుల షెడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా నట్టల వ్యాప్తిని తగ్గించవచ్చని అన్నారు. సర్పంచ్ పట్లోళ్ల హేమలత లాల్‌రెడ్డి మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ అధికారులు గ్రామాల వారిగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో విఎల్ఓ క్రిష్ణమూర్తి, ఓఎస్‌లు శేఖర్, శివ, సిద్దిఖి, గోపాలమిత్రలు శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నట్టల మందు వేస్తున్న డాక్టర్ ప్రీతి

సన్నాలకు రూ. 500 బోనస్

కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధర పొందండి : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, మే 8, ప్రభతవార్త : వరికి గిట్టుబాటు ధరతో పాటు సన్న రకంపై రూ. 500 బోనస్ కూడా ప్రభుత్వం చెల్లించనుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం కడ్తాల్ మండలంలోని ముద్విన్ గ్రామంలో ఉన్న సింగల్ విండో కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల వద్దే ధాన్యం విక్రయాలు చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాలుకు మద్దతు ధర రూ. సన్నాలకు రూ. 2,389, దొడ్డు రకానికి రూ. 2,369 ఇవ్వనున్నట్లు చెప్పారు. కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. ధాన్యం తీసుకువచ్చే రైతులు ఇబ్బందులకు గురి కాకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, సీఈఓ పద్మాకర్ రెడ్డి, దేవేందర్, ఇన్చార్జి మహేష్, సర్పంచ్ సంధ్య వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ కరుణాకర్ గౌడ్, ముద్విన్ ఉపసర్పంచ్ నరసింహ, సింగల్ విండో డైరెక్టర్లు జోగు వీరయ్య, బేలి వెంకటయ్య, చేగురి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ పి.శ్రీధర్

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

-జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ పి.శ్రీధర్

వికారాబాద్, ప్రభాతవార్త : ప్రభుత్వం మత్స్య శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను మత్స్యకారులు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా మత్స్య సహకార సంఘాల చైర్మన్ పి.శ్రీధర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలు సందర్భంగా, మత్స్య శాఖ, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మత్స్యకార సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మత్స్యకారులకు మత్స్య శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల గురించి, చెరువులలో కలుపు మొక్కల నివారణ, చేపలకు వచ్చే వ్యాధుల నియంత్రణ, అధికోత్పత్తి సాధనకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. చెరువులలో చేప పిల్లలు వదలడం మొదలుకుని, ఇతర యాజమాన్య పద్ధతులను అవలంబించి ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్నారు. మత్స్యశాఖ అధికారులు చెప్పిన విధంగా పలు సూచనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ నుండి శీని , నిని ,ఎఫ్‌డీఓ రంగనాయక్, ఎఫ్ఎఫ్ఓ మునేందర్, మత్స్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి పురోగతి సాధించాలి

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి

జిల్లేడు చౌదరి గూడెం, మే 8, ప్రభాతవార్త : గ్రామాల్లో ప్రజలందరూ ఐక్యంగా ఉండి పురోగతి సాధించాలని షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగూడ మండలంలోని వీరన్నపేట గ్రామంలో నిర్వహించిన ఆంజనేయ స్వామి దేవాలయ ప్రారంభోత్సవం, గజ స్థంభం బొడ్రాయి, నవగ్రహ దేవతల ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రార్టీలు ప్రభుత్వాలు ఏవైనా దేవుళ్ళ ముందు అందరూ ఒకటేనని తెలిపారు. ప్రజలు ఐక్యంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. దైవచింతన కలిగిన వారు ఇతరులకు హాని చేయరని ఆయన తెలిపారు. గ్రామాలలో నూతన దేవాలయాలను నిర్మించుకోవడం ఎంతో అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. దేవాలయాల నిర్మాణానికి దైవ కార్యాల ఏర్పాటుకు తమ వంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొందుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ,జాకారం గ్రామ సర్పంచ్ చంద్రశేకర్ తుంపల్లి సర్పంచ్ రామచందర్ వ్నపల్లి మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, పీర్జాపురం గ్రామ సర్పంచ్ నరసింహ బాలరాజ్ సత్యనారాయణ రెడ్డి యాదయ్య సలీం హరీష్ కుమార్ యాదవ్ గౌడ్ పాపయ్య నాయకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మల్లారెడ్డి గూడలో నర్సరీ ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సబితా గోవర్ధన్ రెడ్డి తదితరులు

నర్సరీ ప్లాంటేషన్‌పై అవగాహన

షాబాద్, మే 8, ప్రభాతవార్త : సీఆర్డీ, డిఆర్డీఓ ఆదేశాల మేరకు మే 11 నుంచి క్వాలిటీ కంట్రోల్ విసిట్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో షాబాద్ మండలం మల్లారెడ్డి గూడ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం అధికారులు పరిశీలన చేపట్టారు. గ్రామ సర్పంచ్ సబితా గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్లాంటేషన్ సూపర్వైజర్ రామచంద్ర, సాంకేతిక సహాయకులు పవన్, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి దీపలత, క్షేత్ర సహాయకులు బల్వంత్ రెడ్డి తదితరులు నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్ వాటరింగ్ లొకేషన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ఎంఎంఎస్ ద్వారా ఫస్ట్, సెకండ్ ఫోటోలు క్యాప్చర్ చేసే విధానం, పనుల నమోదుపై కూలీలకు అవగాహన కల్పించారు. అలాగే ఈత బండ్ ప్లాంటేషన్ పనుల పురోగతిని పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీలకు ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని పనులు పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

పోలీసుల పేరుతో బెదిరింపులు

- కిడ్నాప్ చేసి రూ. 33.50 లక్షలు వసూలు

- బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 8, ప్రభాతవార్త : పోలీసుల పేరుతో కిడ్నాప్‌కు పాల్పడి రూ. 33.50 లక్షలు వసూలు చేసిన సంఘటన బంజారాహిల్స్ ఠాణాలో వెలుగుచూసింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. నిఖిల్ అనే యువకుడు మౌనిక అనే యువతితో ఏడాదిపాటు రిలేషన్‌షిప్‌లో ఉన్నాడు. ఇద్దరి మధ్య గొడవల నేపథ్యంలో వేర్వేరుగా ఉంటున్నారు. అనంతరం మౌనిక గచ్చిబౌళి ఠాణాలో నిఖిల్‌పై ఫిర్యాదు చేసింది. సెటిల్‌మెంట్ చేసుకోవడానికి కోటి రూపాయలు డిమాండ్ చేసినట్లు నిఖిల్ ఆరోపణలు చేశాడు. ఇదిలా ఉండగా గత నెల 10న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తమను తాము పోలీసులమని చెప్పి నిఖిల్ స్నేహితుడైన సాయిని బంజారాహిల్స్ రోడ్ నంబరు 13లో కిడ్నాప్ చేసి కుషాయిగూడకు తీసుకెళ్లారు. అక్కడ అతన్ని బెదిరించడంతో నిఖిల్ అనంతపురంలో ఉన్నట్లు చెప్పాడు. దీంతో మరుసటి రోజు అనంతపురం వెళ్లిన వారు నిఖిల్ అతని స్నేహితుడు మహేష్, సాయిలను కిడ్నాప్ చేసి మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో ఉన్న ఒక ఫామ్‌హౌజ్‌కు తీసుకొచ్చారు. అక్కడ బెదిరింపులకు పాల్పడటంతో రూ. 50లక్షలు ఇచ్చేందుకు నిఖిల్ అంగీకరించి రూ. 20 లక్షలు చెల్లించాడు. అనంతరం పంజాగుట్టలో బంగారు ఆభరణాలు విక్రయించి కొంత నగదు తన తండ్రి వద్ద తసుకొని మరో రూ. 13.26లక్షలు చెల్లించాడు. అనంతరం పోలీసుల పేరుతో కిడ్నాప్‌కు పాల్పడింది సుధీర్‌బాబు, జాన్, ప్రసాద్‌రెడ్డిలుగా గుర్తించాడు. మౌనిక ఆదేశాలతోనే వీరు ఈ బెదిరింపులకు పాల్పడినట్లు అనుమానిస్తూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాధ్యం

పరిగి, మే 8, ప్రభాతవార్త: పేదోడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్లతో ప్రభుత్వం నెరవేరుస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురామ్ రెడ్డి, పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి వెంకట్ రాములు అన్నారు. శుక్రవారం పరిగి మండలంలోని గడిసింగాపూర్, లక్ష్మీ దేవిపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో నాయకులు పాల్గొన్నారు. గత ప్రభుత్వం పేదలకు కనీసం డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా ఇవ్వలేదని, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాలతో, నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వంచే ఇందిరమ్మ ఇం డ్లతో పేదలకు గూడునిస్తోందని అన్నారు. సర్పంచ్ అలివేలు నర్సిములు, ఉప సర్పంచ్ మహిపాల్, వార్డు మెంబర్లు శ్రీనివాస్, చరణ్, యాదయ్య, సీనియర్ నాయకులు జనార్దన్, మాణిక్యం, పెంట రెడ్డి, ప్రభు, కాంగ్రెస్ కార్యకర్తలు హాజరయ్యారు

బిజెపి సభను విజయవంతం చేయాలి

పెద్దేముల్, మే 8, ప్రభాతవార్త: ఈ నెల 10న ఆదివారం హైద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే బిజెపి బారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వికారాబాద్ జిల్లా బిజెపి కార్యవర్గసభ్యులు సందీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ మాట్లాడుతూ ఇట్టి భారీ బహిరంగ సభకు ప్రధాని నరేంద్రమోడి రానున్నట్లు తెలిపారు. భారీ బహిరంగ సభకు బిజెపి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్, ఉపసర్పంచ్ తదితరులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చౌడపూర్, మే 8 ప్రభాతవార్త: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే వరికి మద్దతుధర లభిస్తుందని, సన్న వడ్లకు రూ.500 బోనస్‌ను కూడా ప్రభుత్వం అందిస్తుందని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఛంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపల్లి క్లస్టర్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ రజిత నర్సిములు, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, మండల నాయకులు అశోక్ కుమార్, పంచాయితీ కార్యదర్శి సురేందర్ , సర్పంచులు నారాయణ, కృష్ణవేణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బోనగిరిపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

షాబాద్, మే 8, ప్రభాతవార్త : ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాలు సందర్భంగా బోనగిరిపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలమాకుల మల్లయ్య, డిప్యూటీ సర్పంచ్ బుగ్గ రాములు, వార్డ్ మెంబర్లు, రైతులు పాల్గొన్నారు. అనంతరం రైతులకు వేసవికాలంలో పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే చూడి నిర్ధారణ మరియు ఎదకురాని పశువులకు మందులు, మినరల్ మిక్సర్ ఇవ్వడం జరిగింది లేగలకు నటల నివారణ మందులు వేశారు. రైతులకు జొన్నలను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారి స్రవంతి, వ్యవసాయ అధికారి విజయచంద్ర సిబ్బంది బలరాం, అంజయ్య, మహేందర్, రాని, శ్రీకాంత్, సాయి, పాల్గొన్నారు

ఒంటరితనాన్ని లక్ష్యంగా చేసుకొని..

ఏదైనా మీదికి రావాలి.. అప్పుడే అసలు విషయం యాదికొస్తుంది.. నగరంలో చాలా కాలంగా నేపాలి ముఠాలు రెచ్చిపోతున్నాయి.. ఎప్పటికప్పుడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయడం, విమానాలెక్కించి సరిహద్దులకు తరలించడం.. పట్టుబడే నగలు, నిందితులను అరెస్ట్ చూపడం.., ఇంతవరకు బాగా నే ఉంది. కాని, నేపాలీ ముఠాల ఆగడాలు, దోపిడీలు చాలా కాలంగా జరుగుతున్న పోలీసు ఉన్నతాధికారుల వద్ద ఇప్పటివరకు నగరంలో ఉన్న నేపాలీల సంఖ్యలో స్పష్టత లేకపోవడం గమనార్హం. శుక్రవారం మాజీ అదనపు డీజీపీ సతీమణిని నేపాలి ముఠా దోపిడి నేపథ్యంలో హతమా ర్చడంతో మరోసారి నేపాలీ పనిమనుషుల వ్యవహారం తెరమీదకొచ్చింది. ఇందుకోసం శుక్రవారం నేపాలీల సంఖ్య ను తేల్చాలంటూ కింది స్థాయి సిబ్బందితో ఉన్నతాధికారులు సమీక్షాసమావేశం ఏర్పాటుచేశారు.

జూబ్లీహిల్స్, మే 8, ప్రభాతవార్త : ఈ ఏడాది మొదటి అయిదు నెలల్లోనే మూడు వరుస దోపిడి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ మూడింటిలోనూ నేపాలి ముఠాల ప్రమేయం ఉంది. ఫిబ్రవరిలో జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ లో జరిగిన సంఘటనలో వ్యాపారి రవీంద్ర శర్మ నివాసంలో వంటమనిషిగా పనిచేసే నేపాల్‌కు చెందిన భూపేందర్ షాహి తన అనుచర ముఠాతో కలిసి దోపిడికి పాల్పడ్డాడు. ఇంట్లోని పనిమ నుషులకు మత్తు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి కాళ్లు, చేతులు కట్టేసి దాదాపు రూ. 2కోట్లకు పైగా నగలు, నగదు దోచేకెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నేపాల్ సరిహద్దులో కాపుకాసి నిందితులను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు మినహా మిగిలిన నిందితులను పోలీసులు పటు కున్నారు. సరిగా నెల తిరక్కముందే మార్చిలో జూబ్లీహిల్స్ ఎంపీఎమ్మెల్యే కాలనీలో నివసించే వ్యాపారి అనిరుద్‌రెడ్డి, దీపికారెడ్డి నివాసంలో పనిచేసే నేపలి జంట మహేష్ షాహి, అప్సర చాంద్‌లు సైతం ఇలానే మరో ఇద్దరితో కలిసి ముఠాగా ఏర్పడి యజమాని ఇంట్లో చోరికి పాల్ప డ్డారు. ఇంట్లోని నగలు, నగదు తీసుకొని ఉడా యించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి చోరీ చేసిన ముఠాలోని ఒకరిద్దరిని అరెస్ట్ చేయడ మే కాకుండా కొంత నగదును తిరిగి స్వాధీనం చేసకున్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నింది తులు సరిహద్దు దాటి పోవడంతో వారిని పట్టుకోలేకపోయారు. తాజాగా ప్రశాసన్‌నగర్‌లో నివసిం చే మాజీ డీజీపీ వినయ్ రంజన్ రే నివా సం లోనూ పని చేస్తున్న నేపాల్‌కు చెందిన కల్పన మరో ముగ్గురితో ముఠాగా ఏర్పడి గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత దోపిడికి పాల్పడ్డారు. ఈ క్రమంలోనే మాజీ డీజీపీ సతీమణి తనూజ రంజన్‌ను హత్య చేశారు. భారీగా నగలు, నగదు సంచులతో పరారయ్యారు. ఈ మూడు సంఘట నలే కాకుండా నగరంలో నేపాలి ముఠాలకు సం బంధించి మరిన్ని సంఘటనలు చోటుచేసుకున్నా యి. అయితే సంఘటన జరిగినప్పుడు హడావుడి చేసే పోలీసులు నేపాలీల లెక్కను తేల్చకపోవడం గమనార్హం.

యజమానుల ఇళ్లలో నమ్మకంగా పనికి కుదిరే నేపాలీలు యజమానుల కదలికలను పూర్తిస్థాయి లో గమనిస్తుంటారు. కొద్ది రోజుల్లోనే యజమా నులకు దగ్గరవ్వడమే కాకుండా కుటుంబ సభ్యు ల్లో ఒకరిగా మారేంతగా ప్రవర్తిస్తారు. దీంతో చాలా మంది యజమానులు వారిని గుడ్డిగా నమ్మడం, ఇంటి బాధ్యతలు వారికి అప్పగించడం చేస్తున్నారు. దీంతో యజమానులు ఒంటరిగా ఉండటాన్ని గమనించి ముందుగా వేసుకున్న పథ కం ప్రకారం తమ ముఠాను రంగంలోకి దించి దోపిడీలకు పాల్పడుతున్నారు. నందగిరిహిల్స్‌లో ఇంటి కుటుంబ సభ్యులంతా బయటకు వెళ్లడంతో, ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో ఇంటి యజమా నురాలు ఒక్కతే ఉండటం, మరో ప్రాంతానికి వెళ్లడంతో, తాజాగా మాజీ డీజీపీ సతీమణి సైతం ఇంట్లోని ఒక అంతస్థులో ఒక్కతే ఉండ టంతో నేపాలి ముఠాలు దోపిడీలకు పంజా విసి రాయి. గతంలో బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోనూ ఇలానే ఒక వ్యాపారి ఇంట్లో చోరి వ్యవహారంలో అప్పటి బంజారాహిల్స్ డిఐ, ప్ర స్తుత కూకట్‌పల్లి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై భరత్‌భూషణ్‌లు దాదాపు నాలుగు నెలల పాటు శ్రమించి బీహార్‌కు వెళ్లారు. అక్కడ మట్టిలో, గోడల్లో దాచిపెట్టిన దాదాపు రూ. 10కోట్ల విలువైన బంగారు ఆభరణాలను వెనక్కి తీసుకురావడానికి అష్టకష్టాలు పడ్డారు. కాగా తాజాగా ఇప్పుడు నగర పోలీసులు మరోసారి నేపాలీల సంఖ్యపై దృష్టి పెట్టారు. గతంలో నామమాత్రంగా కొన్ని జోన్లలో చేసిన లెక్కల ప్రకారం దాదాపు 1200ల నుంచి 1500ల మం ది పనిమనుషులుగా చేస్తున్నట్లు గుర్తించారు. కాగా నగర వ్యాప్తంగా చూస్తే పనిచేసే వారి సం ఖ్య దాదాపు అయిదువేల వరకు ఉండవచ్చని ఒక పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. అయితే వీరికి సంబంధించిన వివరాలు, ధృవీకరణ పత్రాలు లేకపోవడం, యజమానులు తీసుకోకపోవడంతో అసలు సమస్యలు తలెత్తుతున్నాయి. తాజా సం ఘటనతో పోలీసులు నేపాలీ పనిమనుషుల సం ఖ్యను లెక్కకట్టడంతోపాటు పనిలో కుదిర్చే నేపా లీల వివరాలను, గుర్తింపు కార్డులను తీసు కొనేందుకు సిద్ధమవుతున్నారు.

నేపాలీ పనిమనుషుల దోపిడీలు

నేపాలి పనిమనుషులతో జర జాగ్రత్త : సిపి సజ్జనార్ హెచ్చరిక

నగరంలోని అత్యంత లగ్జరీ అండ్ సెక్యూరిటీ ఎక్కువగా ఉండే ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో దారుణం చోటుచేసుకుంది. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, పోలీసులు దీనిని హత్యగా నిర్ధారించారు. ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ పనిమనిషే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. నిందితులు అత్యంత క్రూరంగా ఈ హత్యకు పాల్పడ్డారు. బాధితురాలి నోట్లో గుడ్డలు కుక్కి, ఆమె గట్టిగా కేకలు వేయకుండా అడ్డుకుని, ఊపిరాడకుండా చేసి ప్రాణాలు తీశారని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, కేవలం దోపిడీ కోసమే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోందని, హత్య అనంతరం నిందితులు పరారయ్యారని పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా నేపాలీ పనిమనుషులను ఇంట్లో పెట్టుకునే వారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. నేపాలీ గ్యాంగ్‌లు తరచుగా ఇలాంటి నేరాలకు పాల్పడుతుంటాయని, వారు ఇంట్లో నమ్మకంగా ఉంటూనే యజమానుల కదలికలపై నిఘా పెడతారని సీపీ తెలిపారు. సరైన అవకాశం దొరికినప్పుడు దొంగతనం లేదా హత్యలకు వెనుకాడరని హెచ్చరించారు. ఇంట్లో పనిమనుషులు ఏం చేస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? అనే విషయాలపై యజమానులు నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. నేపాలీ లేదా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పనిమనుషులను విధుల్లోకి తీసుకునే ముందు వారి ఆధార్ కార్డ్, ఫోటోలు, పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో అందజేసి పోలీస్ వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

బిల్డింగ్ అనుమతుల్లో జాప్యం చేయొద్దు

-టౌన్‌ప్లానింగ్ సిఎంసి కమిషనర్ సృజన ఆదేశం

హైదరాబాద్,మే 8,ప్రభాతవార్త: బిల్డింగ్ అనుమతుల్లో ఎలాంటి జప్యం లేకుండా దరఖాస్తు అందిన వెంటనే పరిశీలించిన నిర్ణీత గడువులోపు పరిష్క రించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన అధికా రులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం సిఎంసి ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని జోన్లలో పనుల గడువు, పారదర్శకత, క్షేత్రస్థాయి అమలుపై చర్చించారు. సమావేశంలో దరఖాస్తుల స్థితిగతులు, ఆక్రమణల తొలగింపు పెండింగ్ అంశాలను నిశితంగా సమీక్షి ంచారు. భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు, టీడీఆర్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు గురించి చర్చిస్తూ, కౌంటర్ అఫిడవిట్లను సకాలంలో దాఖలు చేయాలని నిరంతరం ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ భూముల్లో ఉన్న ఆక్రమణల తొలగింపు పనులను సమీక్షి ంచారు.ప్రజల నుం డి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అలాగే ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో భూసేకరణ పనులకు ఉన్న అడ్డంకులను తొలగించి, రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు. అంతేకుఅండా ప్రజల భద్రత దృష్ట్యా శిథిలావస్థకు చేరిన ప్రమాదకరమైన భవనాలపై తీసు కున్న చర్యలపై ఆరాతీశారు. నిర్ణయాలు వేగంగా తీసుకో వడానికి టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, లీగల్ విభాగాల మధ్య సమన్వయాన్ని పటిష్టం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిటీ చీఫ్ ప్లానర్ (సిపిపి) వెంకన్న, మూడు జోన్లకు చెందిన సిటీ ప్లానర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జి.సృజన, సిసిపి వెంకన్న

అభివృద్ధి పనుల్లో పారదర్శకత కోసమే క్యూఆర్ కోడ్

హైదరాబాద్ మే 8, ప్రభాతవార్త : మల్కాజ్‌గిరి మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పూర్తి పారదర్శకతను పాటించేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. 99 రోజుల కార్యాచ రణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికఖిలో భాగంగా శుక్రవారం ఆయన వనస్థలిపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఎఫ్‌సీఐ కాలనీలో కొనసాగుతున్న వరద నీటి కాలువ పనులను పరిశీలించిన కమిషనర్, అక్కడ ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ వ్యవస్థను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు పనుల వివరాలను చేరవేసేందుకు ఈ టెక్నాలజీని వాడుతున్నట్లు చెప్పారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా కాంట్రాక్ట్ వివరాలు, బడ్జెట్ కేటాయింపులు, గడువు మరి యు సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల వివరాలు ప్రజలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఎఫ్‌సీఐ కాలనీ పార్కులో నిర్వహించిన స్వీయ జనగణన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా జనగణన ప్రక్రియలో పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

కాలనీ పార్కులో పచ్చదనం పెంచడంతో పాటు చిన్నారుల కోసం మరిన్ని ఆట పరికరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో వ్యాధులు ప్రబలకుండా యాంటీ లార్వా ఆపరేషన్లను ముమ్మరం చేయాలని ఎంటమాలజీ విభాగ అధికారులకు సూచించారు.

దోమల నివారణ చర్యల్లో నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. అంతకుముందు వనస్థలిపురం వార్డు కార్యాలయం, లైబ్రరీ హాల్, యోగా సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మోడల్ మార్కె ట్‌లో తమకు ఒక దుకాణం కేటాయించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా కార్పొరేషన్ పరిధిలో నాలాల పూడికతీత పనులు వేగవంతం చేసిన ట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే 1.56 కిలోమీటర్ల మేర డిసిల్టింగ్ పనులు పూర్తి చేశారు. నాలాలను ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేశామని, అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను తొలగిస్తున్న దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సర్పంచ్ గడ్డం వెంకటయ్య

కుల్కచర్ల,మే,8 ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కరానికి కృషి జరుగుతుందని సర్పంచ్ గడ్డం వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలో బోల్ల ఆంజిలయ్య ఇంటిపై ప్రమాదకరంగా ఉన్న కరెంట్ తీగలను స్థానిక సర్పంచ్ గడ్డం వెంకటయ్య ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు తీగలను తొలగించారు. ఈ సందర్భంగా గడ్డం వెంకటయ్యతో పాటు బోల్ల ఆంజిలయ్య విద్యుత్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. అనంతరం సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి, అధికారులకు ధాన్యవాదాలు తెలిపారు.ఈ కర్యక్రమంలో వార్డు సభ్యులు రాజు,సీనియర్ నాయకులు రమేష్, నర్సిలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన అవసరం

కిశోర బాలికలకు అవగాహన

కుల్కచర్ల,మే,8 ప్రభాతవార్త: కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో తల్లితో పాటు అంగన్‌వాడి కార్యకర్తలు బాధ్యత వహించాలని సర్పంచ్ గడ్డం వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలో కిశోర బాలికల అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితులలో నేటి ఆహర అలవాట్ల కారణంగా పదేళ్ల దాటిన బాలికల్లో రుతుస్రా ప్రారంభమవుతోందన్నారు.

బాలికల్లో అవగాహన పెంచడం తల్లితో పాటు, అంగన్‌వాడి కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంత మొగులయ్య,వార్డు సభ్యులు రాజు, మహిళ సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మోడీ సభను విజయవంతం చేయాలి

బిజెపి మండల అధ్యక్షులు వెంకటేష్

కుల్కచర్ల,మే,8 ప్రభాతవార్త: మే 10న హైదరాబాదులోని పరేడున గ్రౌండ్లో నిర్వహించబోవు మోడి భారి బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద ఎత్తున హజరై విజయవంతం చేయాలని కుల్కచర్ల మండల బిజెపి మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ పిలుపునిచ్చారు.శుక్రవారం మండల కేంద్రంలోని మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ...

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన,కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల పట్ల రాష్ట్రంలోని రైతులు, యువత మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆక్రోషంతో ఉన్నారని,అన్ని రంగాలలో పాలన కుంటు పడిందని అన్నారు.ఈ ప్రాంత ముద్దు బిడ్డనని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాను పట్టించకోవడం లేదని,ప్రభుత్వపాఠశాలలో విద్యను బలోపేతం చేస్తానని మాటలకే పరితమయ్యారని,జూలై 2025లో యంగ్ ఇండియా స్కూల్‌ను శంకుస్థాపనకే పరిమితం చేశారని అన్నారు.ఎన్నో పథకాలు ప్రజలకు చెప్పి మోసం చేస్తున్నారని అరోపించారు.మే 10న జరిగే మోడి బహిరంగ సభకు పరిగి నియోజనకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని అందుకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపిచ్చారు.

యాచారంలో జనాభా స్వీయ గణనపై అవగాహన

యాచారం,మే 8, ప్రభాతవార్త:

జనగణనపై అవగాహన కార్యక్రమంలో తాసిల్దార్ ఉపాధ్యాయులు సర్పంచ్

స్వీయగణనపై మండల ప్రజలు అవగాహన కలిగి జనాభా లెక్కలకు ప్రజలు సహకరించాలని యాచారం తాసిల్దార్ అయ్యప్ప కోరారు. శుక్రవారం యాచారం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వీయ గణనపై అవగాహన కల్పిస్తూ యాచారం మండల కేంద్రంలోని సాగర్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి తాసిల్దార్ అయ్యప్ప మాట్లాడుతూ.. 2027 జనగణకు ప్రజలు సహకరించాలని ఆన్లైన్ ద్వారా తమ మొబైల్ తో స్వయం గణన లో నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్వహించే జనాభా గణనలో భాగంగా ప్రజలు స్వయం గణన అధికారిక పోటల్ ద్వారా తమ కుటుంబ వివరాలు నమోదు చేసుకోవాలని సూచన చేశారు.అధికారిక వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని మొబైల్ నెంబర్ ఓటిపితో అందులో చేరవచ్చు అన్నారు. ఇంటి నిర్మాణం,కుటుంబ సభ్యుల వివరాలు ఆస్తుల వంటి 33 ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయాలన్నారు. దీంతో సమయం ఆదా అవుతుందని మనకు సంబంధించిన వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. స్వయం గణన నమోదు పదిహేనురోజులపాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం సర్పంచ్ మస్కు అనిత శరణం, ఉపాధ్యాయులు పరమేష్, శివ కుమార్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్మికులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

మొండి గౌరెల్లిలో పశు వైద్య శిబిరం

యాచారం,మే 8, ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మొండిగౌరెల్లి గ్రామంలో మండల పశు వైద్య అధికారి రేఖ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు.అధికారుల సమక్షంలో మూగజీవాలకు నట్టల మందులు జీర్ణకోశ వ్యాధికి సంబంధించిన మందులను మండల అధికారులు రైతులకు అందజేయడం జరిగింది. పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో మొండి గౌరెల్లి గ్రామ సర్పంచ్ కొలను రమాదేవి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ బడే కుమార్ ,వార్డు సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మొండి గౌరెల్లి పశువైద్య శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ ఉప సర్పంచ్ వైద్య అధికారులు

హాజ్ యాత్ర బస్సును ప్రారంభించిన సిఎం

సిఎం రేవంత్‌రెడ్డికి దన్యవాదాలు తెలిపిన రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్

శామీర్‌పేట, మే 8, ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి నగరంలో హాజ్ యాత్ర బస్సు ను ప్రారంభించటంతో రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ (శామీర్‌పేట) మర్యాదపూర్వకంగా సిఎంను కలిసి సిఎంకు దన్యవాదాలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం శామీర్‌పేట నుంచి రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ నగరంలోని హాజ్ (మైనార్టీ) భవన్‌కు వెళ్లి హాజ్ యాత్ర బస్సు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర హాజ్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో హాజ్‌యాత్ర బస్సు ను సిఎం రేవంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. హాజ్‌యాత్రికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుం టుందని, కేంద్ర ప్రభుత్వం హాజ్‌యాత్రికులపై విధించిన అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలుపటం పట్ల రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ సిఎం రేవంత్‌రెడ్డికి దన్యవాదాలు తెలిపారు. కేంద్రం విధిస్తున్న రూ.10వేలను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలుపటంతో పలువురు హాజ్‌యాత్రికులు హార్షం వ్యక్తం చేశారని ఎండి ముజీబుద్దీన్ అన్నారు.

నగరంలో హాజ్ యాత్ర బస్సు ప్రారంభం సందర్భంగా విచ్చేసిన సిఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ కలిసి అభినందనలు తెలిపి ధన్యవాదాలు తెలిపిన దృశ్యం

శంషాబాద్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యం

-పలు కాలనీలో సిసి రోడ్డు పనులకు శ్రీకారం

-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రంగారెడ్డి అర్బన్ మే8,ప్రభాతవార్త : శంషాబాద్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం శంషాబాద్ సర్కిల్ పరిధిలో రూ. 59 కోట్ల 7 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కొత్వాల్‌గూడలోని సహస్ర శ్రీనివాస ఎన్‌క్లేవ్, శంషాబాద్ డివిజన్ గండి గూడ, ఆటో నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు జోనల్ కమిషనర్ చంద్రకళతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించే దిశగా కృషి చేస్తున్నామని నియోజకవర్గంలోనే శంషాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ ఎస్సీ కిష్టప్ప ,జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు ,స్థానిక నాయకులు ఆర్ గణేష్ గుప్తా ,వెంకటేష్ గౌడ్, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,జోనల్ కమిషనర్ చంద్రకళ,స్థానిక నేతలు

మంత్రి పొన్నం ప్రభాకర్ పుట్టిన రోజున హోమ్ ఫర్ ది డిజబుల్డ్‌లో పండ్లు పంపిణీ

జగ్గంగూడలోని హెమ్‌ఫర్‌ది డిజబుల్డ్ అనాధ ఆశ్రమంలో అనాధ వృద్ధులకు, దివ్యాంగులకు,చిన్నారులకు పండ్లు పంపిణీ చేసిన మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మేడ్చల్ ఎంఎసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, పాల్గొన్న నాయకుల దృశ్యం

శామీర్‌పేట, మే 8, ప్రభాతవార్త: జగ్గంగూడలోని హోమ్ ఫర్ ది డిజబుల్డ్ అనాధ ఆశ్రమంలో రాష్ట్ర బిసి,రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ పుట్టిన రోజును పురస్కరించుకుని అనాధ వృద్దులకు, దివ్యాంగులకు, చిన్నారులకు మేడ్చల్ జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి పండ్లు పంపిణీ చేశారు. అనాధల, దివ్యాంగుల, చిన్నారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్‌ను కట్ చేసి వారికి అందజేశారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడలో ఉన్న హోమ్ ఫర్ ది డిజబుల్డ్ అనాధ ఆశ్రమంలో అనాధ వృద్దులకు, దివ్యాంగులకు, చిన్నారులకు మేడ్చల్ జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి తో పాటు మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, కాంగ్రెస్ నాయకులు పాల్గొని దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేసి దివ్యాంగులు, చిన్నారులతో కేక్‌ను కట్ చేసి వారికి కేక్‌ను వారు తినిపించారు. సుమారు 300మందికి పండ్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్ఎస్‌యుఐ నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని, అంచెలంచెలుగా ఎదిగి గతంలో కరీంనగర్ ఎంపిగా ఉండి తెలంగాణ సాధనలోనూ పార్లమెంట్‌లో బలమైన వాదన వినిపించిన గొప్ప నాయకులు పొన్నం ప్రభాకర్ అని ప్రశంసించారు. తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారని, ప్రజల్లో ఉద్యమ నేతగా నిలిచారని అన్నారు. ప్రజాహితం కోసం నిరంతరం కృషి చేస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు హైదరాబాద్ జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతూ ముందుకు సాగుతున్నారని వారు అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వం మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని వారు ఆశాభావంను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డితో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి విష్ణుగౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి లత, కౌన్సిలర్ బి.మల్లేశ్‌యాదవ్, మాజీ సర్పంచు రాంచందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భస్వారెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, భూపాల్, రాజిరెడ్డి, మహేశ్, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంగూడలో విగ్రహాల ప్రతిష్టలు..ప్రత్యేక పూజలు

శామీర్‌పేట, మే 8, ప్రభాతవార్త: జగ్గంగూడలో విగ్రహాల ప్రతిష్టా పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీకంతమహేశ్వరస్వామి, సురమాంబదేవి, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మ దేవతల విగ్రహాల శిలా, యంత్ర, ప్రాణ ప్రతిష్టా కార్యక్రమం కన్నుకల పండుగగా జరిగింది. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడలో గ్రామ గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో భక్తుల కోలాహలం, వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్దలతో దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంకు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి విచ్చేసి పూజలు చేశారు. ఆ తరువాత మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ విచ్చేసి విగ్రహాల ప్రతిష్టా పూజా కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. వీరితో పాటు మూడుచింతలపల్లి మాజీ ఎంపిపి వి.హరికమురళీగౌడ్, ఉమ్మడి శామీర్‌పేట మండల మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, జిల్లా బిఆర్ఎస్ నాయకులు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, మండల నాయకులు ఎస్.మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌యాదవ్, కౌన్సిలర్లు విష్ణువర్దన్‌రెడ్డి, జంగారెడ్డిలు, నాయకులు టి.అనిల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగరాజుచారి మరి కొందరు నాయకులు విచ్చేసి విగ్రహాల ప్రతిష్టా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంగూడ గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

జగ్గంగూడలో విగ్రహాల ప్రతిష్ట, పూజా కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి,పాల్గొన్న ప్రజాప్రతినిధుల, నాయకులు, భక్తుల దృశ్యం

జగ్గంగూడలో విగ్రహాల ప్రతిష్టా పూజా కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్,పాల్గొన్న నాయకుల,ప్రజాప్రతినిధుల దృశ్యం

..నేడు కళ్యాణోత్సవం, బోనాలు..

..జగ్గంగూడలో విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా 9న శనివారం ఉదయం 10.47గంటలకు శ్రీసురమాంబదేవి, శ్రీకంతమహేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుందని గౌడ సంఘం వారు పేర్కొన్నారు. సాయంత్రం 6గంటలకు శ్రీకంతమహేశ్వరస్వామి వారి, ఎల్లమ్మ తల్లి బోనాల ఊరేగింపు సమర్పించే కార్యక్రమం జరుగుతుందన్నారు.

సొసైటీ పాలకవర్గం తిరిగి బాధ్యతల స్వీకరణ

-హైకోర్టు తీర్పుతో పిఐసి రద్దు..ఎంసి కొనసాగింపు

ఘట్‌కేసర్, మే 8, ప్రభాతవార్త: హైకోర్టు తీర్పుతో ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం పాలకవర్గం తిరిగి బాధ్యతలు స్వీకరించింది. పర్సన్ ఇంచార్జ్ కమిటీని తొలగించి పాలకమండలికి బాధ్యతలు అప్పగించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును ఇవ్వడంతో ప్రభుత్వం ఎంసి కొనసాగడానికి అవకాశం కల్పించింది. స్పెషల్ సిసి, ఆర్‌సిఎస్ ఆదేశాలతో మేడ్చల్ జిల్లా సహకార అధికారి వి.నాగలింగచారీ పిఐసీ నుంచి ఘట్‌కేసర్ సొసైటీ మేనేజింగ్ కమిటీకి తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు సొసైటీ చైర్మన్‌గా సింగిరెడ్డి రాంరెడ్డి, వైస్‌చైర్మన్‌గా బద్దం అనంతరెడ్డి, డైరెక్టర్లుగా రేసు లక్ష్మారెడ్డి, జిల్లాల పోచిరెడ్డి, బీరెడ్డి స్రవంతి, వడిత్య మహేందర్‌నాయక్, చందుపట్ల ధర్మారెడ్డి, కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, జడిగె రమేశ్, గోపు బాల్‌రాజుయాదవ్, ఇటిక్యాల రామకృష్ణారెడ్డిలు తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఋణాల విషయంలో నిబంధనలు పాటించని ఇద్దరు డైరెక్టర్లు వంగూరి లక్ష్మమ్మ, గ్యార వెంకటేశ్‌లు పదవులు కోల్పోయారు. ఘట్‌కేసర్ సహకార సంఘం పదవీకాలం 2025 ఫిబ్రవరి 14తో ముగియగా ప్రభుత్వం ఆరు నెలల పాటు పొడగించి 2025 ఆగష్టు 14 వరకు కొనసాగించింది. అనంతరం సీసీ, ఆర్‌సిఎస్ ఆదేశాల మేరకు గత డిసెంబర్ 19న సొసైటీకి పర్సన్ ఇంచార్జ్ కమిటీని నియమించగా ఘట్‌కేసర్ సొసైటీకి అధికారి పర్సన్ ఇంచార్జ్‌గా సహకారశాఖ నుంచి వచ్చిన ఎం.దుర్గ కొనసాగారు. పాతపాలకవర్గాలకే బాధ్యతలు అప్పగించాలని సొసైటీల చైర్మన్లు కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పును ఇచ్చింది. దీంతో ప్రభుత్వం ఏప్రిల్ 29న పర్సన్ ఇంచార్జ్ కమిటీలను ఉపసంహరించుకొని తిరిగి ఎన్నికలు జరిగే వరకు పాలకవర్గాలు కొనసాగేవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది. కాగా మాజీలు మారిన సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు తిరిగి పదవీలోకి రావడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఘట్‌కేసర్ సొసైటీలో తిరిగి బాధ్యతలు చేపడుతున్న చైర్మన్ రాంరెడ్డి, డైరక్టర్లు

సర్వే కిట్లు పంపిణి చేస్తున్న తహసిల్దార్ శ్రీనివాస్

ఉపాధ్యాయులతోనే సర్వే ప్రక్రియ సాధ్యం

...తహసిల్దార్ శ్రీనివాస్

కోట్‌పల్లి, మే 8, ప్రభాతవార్త: ఉపాధ్యాయులతోనే సర్వే ప్రక్రియ సాధ్యం అవుతుందని తహసిల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్లకు అవసరమైన పరికరాలను అందజేశారు. ఇంటింటికి జనగణన విధులను పక్కాగా నిర్వహించాలని అన్నారు. అప్పుడే ఆయావర్గాల ప్రజలకు భవిష్యత్తులో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అమలుచేయాల్సిన సంక్షేమపథకాలపై ప్రభుత్వం ఒక అవగాహనకు వచ్చి కార్యచరణను అమలు చేసేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. ఈసారి సెల్ఫ్ డిక్లరేషన్ ఎంతో ముఖ్యమని, అధికారులు, ఎన్యుమరేటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చార్జ్ ఆఫీసర్లు ప్రతిరోజు జనగణన ప్రక్రియను సమీక్షించాలని, తామూ కూడా రోజువారీగా పర్యవేక్షణ జరుపుతామని అన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందితో నిర్దేశిత గడువులోపు జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను మెరుగైనరీతిలో పూర్తిచేసేలా సన్నద్ధం చేయాలని అన్నారు. ప్రణాళికల రూపకల్పన అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాల రూపకల్పనకు దోహదపడే జనగణన ప్రక్రియను నిబద్ధత, అంకితభావంతో నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి మే 8 ,ప్రభాతవార్త: తలకొండపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఉప్పల వెంకటేష్ తెలిపారు. మండల కేంద్రంలో లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ మాట్లాడుతూ గుట్టపైన గత నాలుగు సంవత్సరాలుగా లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం నాలుగో వార్షిక మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 9న అభిషేకం, ప్రత్యేక పూజ10న లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం, మాతృదినోత్సవం పురస్కరించుకొని అమ్మ పాదపూజ, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఉప్పల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ కోటీశ్వర్, మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, కనుక వెంకటయ్య, పోతుగంటి యాదయ్య, నరసింహ, వెంకటేష్ యాదవ్, కుమార్ రొయ్యలైన అదే తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం బాధ్యతలు చేపట్టిన కేశవరెడ్డి

తలకొండపల్లి, మే 8, ప్రభాతవార్త: తలకొండపల్లి మండల పిఎసిఎస్ అధ్యక్షులుగా గట్ల కేశవరెడ్డి పదవీబాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే పిఎసిఎస్ పాలకవర్గం సమయం ముగియడంతో ప్రభుత్వం వారికే ఎన్నికలు జరుపకుండా వాయిదా వేస్తూ వచ్చారు. ఇటీవల కోర్టు తీర్పు అనంతరం పాలకవర్గానికి తీర్పు అనుకూలంగా రావడంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో సింగల్ విండో సెక్రెటరీ ప్రతాప్ రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటికే మూడు టర్మలు సింగల్ విండో చైర్మన్గా గట్ల కేశవరెడ్డి పదవి చేపట్టి మండలంలో ఆక్టివ్‌గా నిలిచారు. మళ్లీ ప్రభుత్వ నిబంధన మేరకు చైర్మన్గా బాధ్యతలు చేపట్టారు.

నీటి కొరతకు బోర్ వేయించిన సర్పంచ్

తలకొండపల్లి, మే 8, ప్రభాతవార్త:

తలకొండపల్లి మండల కేంద్రంలో వేసవికాలంలో నీటి కొరత ఏర్పడడంతో గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ చొరవ తీసుకొని తాగునీటి కోసం బోరు వేయించారు. స్థానిక రైతు వేదిక సమీపంలో నూతనంగా తాగునీటి కోసం బోర్ వేయించి గ్రామస్తులకు తాగునీటి సమస్య లేకుండా చూస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మిషన్ భగీరథ వాటర్ వస్తున్నప్పటికీ తలకొండపల్లి గ్రామంలో ప్రజల అవసర నిమిత్తం త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు బోర్ వేయించి నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ కోటీశ్వర్, మాజీ సర్పంచ్ పెరుమళ్ళ లలిత జ్యోతి కార్యదర్శి సత్యం వార్డు సభ్యులు మల్లీశ్వరి కుమార్ వెంకటేష్ అలివేలు నరసింహ తదితరులు ఉన్నారు.

మండల ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

తలకొండపల్లి మే 8 ,ప్రభాతవార్త:

తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నాడు జనాభా లెక్కల పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. తలకొండపల్లి తాసిల్దార్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందితో జనగణన పోస్టర్ తో రెవెన్యూ సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ రమేష్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశం మేరకు మండలంలోని ప్రతి ఒక్కరు జన గణనకు వచ్చే అధికారులకు సహకరించాలని, ప్రతి ఒక్కరు తమ ఇంటి యజమానులు పూర్తి వివరాలుతో సమాచారం అందజేయాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు లు జిపిఒలు తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యమే రైతుల ఆర్థిక బలం

కొత్తూరు, మే 8, ప్రభాతవార్త: కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో స్థానిక పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పశు ఆరోగ్య శిబిరాలకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది అని డాక్టర్స్ స్ఫూర్తి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద అభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వందలాది పశువులకు ఉచిత వైద్య సేవలు అందించారు. శిబిరంలో భాగంగా పశువులకు దినిగి వ్యాక్సినేషన్, గర్భ నిర్ధారణ పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు, కృత్రిమ గర్భాధానం, ఖనిజ మిశ్రమాల పంపిణీ వంటి సేవలు నిర్వహించారు. ముఖ్యంగా ఆవుల్లో అధిక పాల ఉత్పత్తి కోసం సెక్స్ సార్టెడ్ సీమెన్ ద్వారా కృత్రిమ గర్భాధానం చేపట్టడం రైతులను ఆకట్టుకుంది. శిబిరంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని తమ పశువులకు వైద్య సేవలు పొందారు. పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంపు, వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు. శిబిరం విజయవంతం కావడంతో రైతులు పశుసంవర్ధక శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు పాల్గొన్న రైతులు,నాయకులు

సమగ్ర పశుసంవర్ధక సేవా శిబిరం..చికిత్సలు, పోటీలు

ఘట్‌కేసర్, మే 8, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్‌లో శుక్రవారం సమగ్ర పశుసంవర్ధక సేవా శిబిరం నిర్వహించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలలో భాగంగా పశుసంవర్ధక చికిత్స, అవగాహన శిబిరం జరిపారు. పశుసంవర్ధకశాఖ ఉప్పల్ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీకాంత్‌లు శిబిరాన్ని సందర్శించారు.



దూడల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఈసందర్భంగా ఒక సంతోనోత్పత్తి శిబిరం నిర్వహించగా 265 పశువులకు పరీక్షలు, 42 మంది రైతులకు ప్రయోజనం కల్గిందని తెలిపారు. దూడల ర్యాలీ జరుపగా 22 దూడలు పాల్గొన్నాయని, ఐదుగురు రైతులకు 50 కిలోల క్వాంటిటి ఫీడర్ విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వేసవి మేనేజ్‌మెంట్ అవగాహన కార్యక్రమం నిర్వహించగా 42 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు. ఈసందర్భంగా పాల పోటీ నిర్వహించగా మొదటి బహుమతి శివయ్య ఒకరోజుకు 65 లీటర్లు, ద్వితీయ బహుమతి ఎ.మహిపాల్‌రెడ్డి రోజుకు 55 లీటర్ల పాలదిగుబడి చేశారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ పశువైద్యాధికారిని డాక్టర్ పద్మిని, జెవిఓ శంకర్‌రెడ్డి, భూషన్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు బాధితులకు ప్రభుత్వ హామీలను నెరవేర్చాలి

ఘట్‌కేసర్, మే 8, ప్రభాతవార్త: ఘట్‌కేసర్‌లో రోడ్డు వెడల్పు సందర్భంగా నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బాధితులు శుక్రవారం సాయంత్రం నిరసన ర్యాలీ జరిపారు. రైల్వేవంతెన పనులు జరుగుతున్న స్థలం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నినాదాలు చేస్తూ బాధితులు నిరసన ప్రదర్శన జరిపారు. ఆర్‌ఓబి కారణంగా ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన బాధితులకు కోర్టులో డిపాజిట్ చేసిన నష్ట పరిహారం చెల్లించాలని, గతంలో 100 గజాల స్థలం కొండాపూర్‌లలో, డబుల్‌బెడ్‌రూమ్ కేటాయిస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌ఓబి బాధితులకు ఇప్పటి వరకు నష్ట పరిహారం ఇవ్వకుండా వంతెన పెండింగ్ బిల్లు విడుదల చేశారని గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటని విమర్శించారు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం గజానికి మార్కెట్ విలువకు 4 రెట్లు అధికంగా పరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు.



ఘట్‌కేసర్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న రోడ్డు బాధితులు